విద్యారంగంపై నిర్లక్ష్యం



గజపతినగరం రూరల్: డోలపాలెం పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

- సకాలంలో అందని స్టూడెంట్ కిట్లు
- చాలీచాలని యూనిఫారాలు, బూట్లు
- మధ్యాహ్న భోజనం మెనూ అమలులో నిర్లక్ష్యం

దత్తిరాజేరు/చీపురుపల్లి/ఎస్.కోట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యారంగంపై నీలినీడలు అలముకున్నాయి. విద్యాభివృద్ధితోనే సామాజిక అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా రంగంలో సంస్కరణలు తీసుకువచ్చి, అన్ని విధాలుగా అభివృద్ధి చేశారు. పాఠశాలలకు కావాల్సిన అదనపు భవనాలు మంజూరు చేయడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలు, షూలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందజేసి విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందారు. అయితే రెండు నెలల కిందట ఏర్పాటైన కూటమి ప్రభుత్వం విద్యా రంగంపై నిర్లక్ష్యం కనబరుస్తోంది. సర్కారు బడులనును నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం తీరు ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు తెరిచి రెండు నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు పూర్తిస్థాయిలో పాఠ్య,నోట్ పుస్తకాలు పంపిణీ చేయలేకపోయారు. అలాగే యూనిఫారాలు, షూల పంపిణీలో కూడా కొన్ని కొన్ని ఇబ్బందులేర్పడ్డాయి.

కొలతల్లో తేడాలు...



చీపురుపల్లి : బాలుర ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యారంగం అభివృద్ధి దిశగా పరుగులు పెడితే.. కూటమి ప్రభుత్వ హయాంలో నిస్తేజంగా మారింది. విద్యార్థులకు అందించాల్సిన పుస్తకాలు, షూలు, యూనిఫారాల విషయంలో కొంత అలసత్వం కనిపించింది. సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడ్డామని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. యూనిఫారాలు కూడా అంత నాణ్యంగా లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల కు కొలతలు తీసి షూలు అందించినప్పటికీ, కొలతల్లో తేడాలు రావడంతో బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చీపురుపల్లి నియోజకవర్గంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో మొత్తం 266 పాఠశాలలున్నాయి. అయితే ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. చీపురుపల్లి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. చీపురుపల్లి మండలంలోని జి.అగ్రహారం ప్రాథమి కోన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు లేకపోవడంతో వేరే పాఠశాల నుంచి వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులను తాత్కాలికంగా పంపించారు. అలాగే రామాంజనేయకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో పాటు గుర్ల మండలంలోని కలవచర్ల, పెదమజ్జిపేట, ఎల్విన్‌పేటలో గల పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడు మాత్రమే పని చేస్తున్నారు. అలాగే మెరకముడిదాం మండలంలోని బిల్లలవలస, గోపన్నవలస, బుధరాయవలస పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత ఉంది. అంతేకాకుండా మండంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత కూడా వేధిస్తోంది.

విడతల వారీగా పంపిణీ..

శృంగవరపుకోట: నియోజకవర్గంలోని ఎస్.కోట మండలంలోని 60 పాఠశాలల్లో 3696 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వేపాడ మండలంలోని 50 పాఠశాలల్లో 2701 మంది విద్యార్థులు ఎల్. కోట మండలంలో 47 పాఠశాల ల్లో 2,870 మంది విద్యార్థులు, కొత్తవలస మండలంలోని 67 పాఠశాలల్లో 6,789 మంది విద్యార్థులు, జామి మండలంలోని 50 పాఠశాలల్లో 3,310 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులకు విద్యాకానుక కిట్లు ఒకే సారి అందించకపోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయి. విద్యార్థులకు ఇచ్చిన బూట్ల కొలతల్లో తేడాలు రావడంతో ఇక్కట్లు తప్పలేదు. ఇదిలా ఉంటే వేపాడ బాలికల గురుకుల పాఠశాలలో 80 మంది విద్యార్థినులకు స్టూడెంట్ కిట్లు పూర్తిస్థాయిలో అందలేదు. అలాగే వేపాడ మండలం బల్లంకిలో ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉండడంతో తరగతుల నిర్వహణ కష్టంగా మారింది.



దత్తిరాజేరు: షికారుగంజిలో రెండు మూడు తరగతులకు కలిపి బోధిస్తున్న ఉపాధ్యాయిని

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత..



గజపతినగరం రూరల్: మర్రివలసలో ఏకోపాధ్యాయ పాఠశాల

దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గంలో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో తరగతుల నిర్వహణ కష్టంగా మారుతోంది. నియోజకవర్గంలో దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో మొత్తం 221 పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో 15,457 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తుండగా... వారికి సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో తరగతుల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బొండపల్లి మండలం కొవ్వాడపేట, రాచకిండాం, ఒంపల్లి, గొట్లాం... దత్తిరాజేరు మండలంలోని షికారుగంజి, రామచంద్రాపురం, టి.భూర్జ వలస, లింగాలవలస, పెదమానాపురం, దత్తిరాజేరు, దత్తి, పోరలి, గడసాం.. గజపతినగరం మండలం మరుపల్లి, మర్రివలస, కొత్తవలస, గుడివాడ, గంగచోళ్లపెంట.. గంట్యాడ మండలం లక్కిడాం , గంట్యాడ, పెదమజ్జిపాలెం, నరవ, బుడతనాపల్లి గ్రామాల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇదిలా ఉంటే అధికారుల నిర్వహణ లోపం కారణంగా మధ్యాహ్న భోజనం పథకం మెనూ అంతగా అమలు కావడం లేదని సమాచారం. గజపతినగరం మండలంలో 14 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

క్లుప్తంగా

ప్రతీ ఇల్లు గ్రంథాలయంగా మారాలి



రావివలసలో సంచార గ్రంథలయం వద్ద పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు, యువత

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఇల్లు గ్రంథాలయంగా మారాలని ఆశయ రూరల్ లైబ్రరీ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. మండలంలోని రావివలస గ్రామంలో ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఆదివారం సంచార గ్రంథాలయ సేవలను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు, యువతతో పుస్తక పఠనం చేయించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ విజ్ఞాన పుస్తకాలు ఉండాలన్నారు. తల్లిదండ్రులు బయటకు వెళ్లేటప్పుడు ఒక పుస్తకాన్ని తీసుకొచ్చి ఇంటిలో ఉంచాలన్నారు.విలువైన సమయాన్ని టీవీలు, మొబైల్స్‌తో కాలక్షేపం చేస్తూ వృథా చేయకుండా పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం ద్వారా మేథస్సు పెరుగుతుందన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

గుర్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ భాస్కరరావు సూచించారు.మండల కేంద్రంలో పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలు వురు మైనర్లను గుర్తించి కేసులు నమోదు చేశారు.

నేత్రవైద్య శిబిరం



నేత్రశస్త్ర చికిత్సలు చేయించుకునేందుకు పయనమైన వృద్ధులు

వేపాడ: స్థానిక పాలకేంద్రం వద్ద శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 78 మందికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్ చందన నేత్రపరీక్షలు చేసి 48 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్‌లు చేసి, కళ్లద్దాలు అందజేసేందుకు ప్రత్యేక బస్సులో శంకర్‌ఫౌండేషన్ ఆస్పత్రికి ఆతరలించామని క్యాంపు సమన్వయకర్త జోగారావు తెలిపారు.

ఈపీఎఫ్ పెన్షనర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘ ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఈపీఎఫ్ కనీస పింఛన్ రూ.9 వేలకు పెంచాలని, డీఏ, ఉచిత వైద్యం అందించాలని కోరుతూ గరివిడి పట్టణంలో పెన్షనర్లు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘ ప్రతినిధులు మూర్తి,రామారావు, సన్యాసినాయుడు, జగదీష్, అప్పలరాజు మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈనెల 6,7,8 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. తమ డి మాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తవలస: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలోని వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో కొత్తవలస జంక్షన్‌లో ఆదివారం విరాళాలు సేకరించారు. సీపీఎం నాయకులు డేగల అప్పలరాజు, చల్లా జగన్, మద్దిల రమణ తదితరులు దుకాణాల వద్దకు వెళ్లి వయనాడ్ విపత్తును వివరించి, బాధితులను ఆదుకునేందుకు సహాయం అర్థించారు. సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.పావని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులంతా హాజరుకావాలని ఆదేశించారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువత

కొత్తవలస: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసిన వారం అవుతామని, రక్తదానం ఒక గొప్ప సామాజిక సేవా కార్యక్రమమని సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కనకాల శివ అన్నారు. స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో సుబ్బలక్ష్మి చారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం రక్తదానశిబిరం నిర్వహించారు. ట్రస్టు సభ్యులతో పాటు యువకులు రక్తదానం చేశారు. 32 యూనిట్‌ల రక్తాన్ని సేకరించినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వై.శివనాగేంద్ర రెడ్డి తెలిపారు. ఈసంద ర్భంగా సుబ్బలక్ష్మి ట్రస్టు చైర్మన్ శివ మాట్లాడుతూ అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 65 ఏళ్ల లోపువారంతా రక్తదానం చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్త దాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ట్రస్టు సభ్యు లు మీసాల దుర్గాప్రసాద్, పి.శివరామకృష్ణ, సీహెచ్. మురళి, కర్రి చిన్న, బొల్లాప్రగడ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధం

దత్తిరాజేరు: మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8వ తేదీన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ వెంకటరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్, తల్లిదండ్రుల ఓటర్ల జాబితాను పాఠశాల నోటీస్ బోర్డుల్లో పెట్టించామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై 5వ తేదీన అభ్యంతరాల స్వీకరించి, తుదిజాబితాను విడుదల చేస్తామని వివరించారు. 8వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం 1:30 గంటల లోపు ఎన్నికలు నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటలకు స్కూల్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తామని వివరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గరివిడి శ్రీరామ్ హైస్కూల్ 1982-83 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ హైస్కూల్ (ప్రస్తుత ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్)లో 1982-83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువు కున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శ్రీరామ్ ఆఫీసర్స్ క్లబ్ వేదికగా ఆదివారం జరిగింది. నాలుగు దశాబ్దాల క్రితం పాఠశాల విద్యాభ్యాసాన్ని పూర్తి చేసు కుని, తర్వాత వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదువుకుని వివిధ రంగాల్లో చైన్నై, హైదరాబాద్, బెంగళూరు, పూణే తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఐదు పదుల వయస్సు దాటి తాతయ్యలుగా మారిన తర్వాత స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ నేపథ్యాల గురించి మాట్లాడుకున్నారు. తాము చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

21న భారత్ బంద్



మాట్లాడుతున్న ప్రజాగాయకుడు ఉదయ్‌భాస్కర్

శృంగవరపుకోట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈనెల 21న భారత్ బంద్ నిర్వహించనున్నట్లు ప్రజా గాయకుడు ఆతవ ఉదయ్ భాస్కర్ తెలిపారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో స్థానిక దళిత నేతలు డోల కేశవ, గుర్రపు శ్రీను, తెరపల్లి కోటారావు ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ షెడ్యూలు కులాలు, తెగల మధ్య సుప్రీం తీర్పు కులాల చిచ్చు రగిలించిందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడవడాన్ని దళిత సంఘాలు ఖండిస్తున్నాయన్నారు. కోర్టు తీర్పును నిలిపివేయా లని కోరుతూ 21న ప్రతీ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. దళిత నాయకులు బండ అప్పన్న, తెరపల్లి అప్పారావు, బోని శేఖర్, లోకేటి ఈశ్వరరావు, గాలి క్రాంతి, డోల రాము తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు..

విజయనగరం టౌన్: యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. విజయ కల్యాణి సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ తిరుమల నర్సింగ్ హోమ్ నుంచి మయూరీ జంక్షన్ వరకు ఆదివారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యువత మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు రవాణా చేసినా, వినియోగించినా చర్యలు తప్పవన్నారు. అదే విధంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తిరుమల నర్సింగ్ హోమ్ విద్యార్థులు, ఆదిత్య, నారాయణ కళాశాల విద్యార్థులు, ఇస్కాఫ్ సంస్థ సభ్యులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

టైరు పేలి అదుపుతప్పిన వ్యాన్



రోడ్డు పక్కన కాలువలోకి దూసుకెళ్లి తాటిచెట్టును ఢీకొన్న వ్యాన్

శృంగవరపుకోట: మండలంలోని రాజీపేట గ్రామం వద్ద ఆదివారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపి న వివరాలు...ఎస్.కోట నుంచి ఇటుకలు లోడుతో అరకు వైపు వెళుతున్న వ్యాన్ రాజంపేట గ్రామం దాటగానే టైరు పేలు పోయింది. దీంతో వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లి తాటి చెట్టును ఢీకొట్టింది. డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై బయటకు దూకివేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వ్యాన్ క్యాబిన్‌లో ముగ్గురు కూలీలు చిక్కుకున్నారు. పక్కనే పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి చేరుకుని జేసీబీ తీసుకొచ్చి క్యాబిన్‌లో చిక్కుకున్న వారిని బయట కు తీశారు. వ్యాన్ అదుపుతప్పిన సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

ఆధునిక పద్ధతులు పాటించాలి



గరికివలసలో రైతులకు డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

గుర్ల: సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ఎం.తిరుపతి రావు అన్నారు. డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు నాటే విధానంపై నల్ల చెరువు, గరికివలస గ్రామాల్లో రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు వరుస క్రమంలో విత్తుకోవచ్చన్నారు. మొక్కల మధ్య సమదూరం ఉండడం వల్ల గాలి,వెలుతురు బాగా ప్రసరించి పంటకు చీడపీడల సమస్య ఉండదని, మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు.

ఈ-క్రాప్ నమోదు ఎప్పుడు..?

- ఉబాలు పూర్తయినా మొదలు కాని పంట నమోదు
- నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది రైతుల ఎదురుచూపు



చౌడువాడలో ఈ-క్రాప్‌లో నమోదు కాని వరిపంట

పూసపాటిరేగ : అన్నదాతల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కనబరుస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్నదాతకు ఇంతవరకు పెట్టుబడి సాయం ఇవ్వలేదు. దీనికితోడు ఉబాలు పూర్తయినా ఇంతవరకు ఈ-క్రాప్ నమోదు చేయలేదు. అనుకోని విపత్తు జరిగితే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందో,లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.నెల్లిమర్ల నియోజకర్గంలో రైతులు ప్రధానంగా వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగు చేస్తున్నారు. 19,672 ఎకరాల సాగువిస్తీర్ణం కాగా..ప్రస్తుతం 4376 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా పంటలసాగు సమయంలో వ్యవసాయశాఖ సిబ్బంది పొలాల వద్దకు వచ్చి ఈ-క్రాప్ చేసేవారు. దీంతో విపత్తుల సమయాల్లో పంటలు దెబ్బతింటే ప్రభుత్వం నుంచి పరిహారం అందేది. కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభించలేదు.విధివిధానాలు వచ్చినా,ఇంకా సంబంధిత మొబైల్‌యాప్ రాలేదని సమాచారం.దీంతో ఈ-క్రాప్ నమోదు ఆలస్యం కానున్నట్లు భోగట్టా.

గత ప్రభుత్వ హయాంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించి వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటును అందించారు. దీంతో పాటు ఈ-క్రాప్ నమోదు ద్వారా పంటల సాగుకు ఎరువులు, పంట అమ్మకాలు, పంటకు నష్టం జరిగినప్పుడు పరిహారం అందించేవారు. ప్రస్తుతం ఈక్రాప్ నమోదు ఇంతవరకు చేపట్టలేదు.

త్వరలోనే ఈక్రాప్ ప్రారంభిస్తాం..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ నమో దుకు ప్రభుత్వం నుంచి విధివిధానాలు వచ్చాయి. దీంతో పాటు వెబ్‌ల్యాండ్ డేటాను డౌన్‌లోడ్ చేసుకుంటున్నాం. వీఏఏలకు మొబైల్ యాప్ రావాల్సి ఉంది. రెండు, మూడు రోజులులో ఈక్రాప్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

కె.నీలిమ, మండల వ్యవసాయ శాఖాధికారి పూసపాటిరేగ